క్లుప్తంగా

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన


రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

నాగలాపురం: పెళ్లకూరు మండలంలోని చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద నేత్రాలయ వైద్యులు స్థానిక సాయిబాబా మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 205 మందికి పైగా రోగులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. 70 మందికి మందులు, 45 మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ, 75 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నట్లు మేనేజింగ్ ట్రస్టీ చాగణం గౌరీశంకర్, సీఈఓ సీతారామనాయుడు తెలిపారు. ట్రస్ట్ ఏఓ కృష్ణ, అరవింద్ నేత్రాలయ సిబ్బంది గౌరీ శంకర్ పాల్గొన్నారు. సాయిబాబా ఆలయ ప్రతినిధులు జగదీశ్‌రెడ్డి, ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జంతువులకు యాంటీ రేబిస్ టీకాలు


కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేస్తున్న డాక్టర్ దయాకర్

సత్యవేడు: జంతువుల ఆరోగ్యం కోసం యాంటీ రేబిస్ టీకాలు వేస్తున్నట్టు ఇరుగుళం పశువైద్యాధికారి దయాకర్ తెలిపారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం సత్యవేడు పశువైద్యశాల ప్రాంగణంలో కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ జంతువుల నుంచి మానవులకు కొన్ని వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. పిచ్చికుక్క మనిషిని కరిస్తే ప్రమాదకరమైన రేబిస్ వ్యాధి వస్తుందన్నారు. ఈ క్రమంలో ముందుగానే జంతువులకు యాంటీ రేబిస్ టీకా వేయించాలన్నారు. ఆస్పత్రిలో 500 డోసుల టీకాలు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వెటర్నటీ సిబ్బంది సుందరం, విలేబి రాజు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం


రాజమోహన్‌బాబు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

వరదయ్యపాళెం: విశ్రాంత ఉపాధ్యాయుడు రాజమోహన్‌బాబు సేవలు మరువలేనివని ఎంఈఓ సరస్వతి కొనియాడారు. వరదయ్యపాళెంలోని ఆర్ఆర్ కల్యాణ మండపంలో ఆదివారం రాజమోహన్‌బాబు ఉద్యోగ విరమణ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఆయన్ను ఉపాధ్యాయులు, బంధుమిత్రులు, స్నేహితులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓలు మునిసుబ్రమణ్యం, గున్నయ్య, ప్రధానోపాధ్యాయులు మొహిద్దీన్, ఉపాధ్యాయులు బందిలకుమార్, ఆనంద్, తిరుపతి నాయుడు, వెంకటమోహన్, రుష్యేంద్ర, శశికుమార్, భగవాన్ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ అధ్యక్షునిగా పార్థసారథి



శ్రీకాళహస్తి: రోటరీ క్లబ్ నూతన అధ్యక్షునిగా పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది పసుపులేటి పార్థసారథి ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి హాజరయ్యారు. స్థానిక రోటరీ భవన్‌లో జరిగిన 2025–2026 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. కార్యదర్శిగా పి.సుధాకర్ ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కమిటీ సభ్యులకు మాజీ రోటరీ సభ్యులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

నారా లోకేష్‌కు సాదర స్వాగతం


లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్

రేణిగుంట: నెల్లూరు జిల్లా పర్యటన నిమిత్తం ఆదివారం రాత్రి రాష్ట్ర మంత్రి నారా లోకేష్ రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. విమానాశ్రయంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, బీసీ వెల్ఫేర్ మంత్రి సవిత, జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో లోకేష్ నెల్లూరుకు వెళ్లారు.

సెక్యూరిటీ లేని వైద్యం

- రాత్రుల్లో విధులు కష్టమంటున్న వైద్య సిబ్బంది


చిన్నపాండూరు పీహెచ్‌సీ

వరదయ్యపాళెం: మండలంలోని చిన్నపాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సెక్యూరిటీ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రాత్రుల్లో సెక్యూరిటీ లేకుండా విధులు నిర్వహించడం కష్టం అంటూ వైద్య సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. 24గంటల స్థాయి కలిగిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గత ప్రభుత్వం రూ.2కోట్లతో నూతన భవనాన్ని నిర్మించింది. ఆ భవనాన్ని అధికారికంగా ప్రారంభించినప్పటికీ అనధికారికంగా అక్కడే వైద్యసేవలను కొనసాగిస్తున్నారు. అయితే ప్రస్తుతం నూతనంగా నిర్మించిన ఆస్పత్రి భవనం ప్రధాన రోడ్డుకు కొంత లోపలికి ఉండడం, దానికి తోడు భవనానికి ఇరువైపులా అడవిని తలపించే విధంగా ఖాళీ స్థలం ఉంది. దీంతో రాత్రి వేళల్లో మందుబాబులు, ఇతర కార్యకలాపాలకు పాల్పడే ఆకతాయిలు ఆస్పత్రిలోనికి వెళ్లడం మద్యం మత్తులో వైద్య సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించడం లాంటి ఇబ్బందులను రోజూవారి మహిళా వైద్య సిబ్బంది ఎదుర్కొంటున్నారు. దీనిపై అనేకమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా ప్రభుత్వం నుంచి సెక్యూరిటీ సిబ్బందిని నియమించలేదు. ప్రధానంగా రాత్రివేళల్లో మహిళా స్టాఫ్ నర్సు, మహిళా అటెండర్ మాత్రమే విధులు నిర్వహిస్తారు. ఏ రాత్రి ఏమి జరుగుతుందోనన్న ఆందోళనలో వారు విధులు నిర్వహిస్తున్నట్లు వాపోతున్నారు. రాత్రి వేళలో మాత్రం ఒక పురుష సెక్యూరిటీ సిబ్బందిని నియమిస్తే మా విధులకు భద్రతగా ఉంటుందని వారు కోరుతున్నారు.

శ్రీసిటీ సాకారంతో గతంలో సెక్యూరిటీ నియామకం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సెక్యూరిటీ సమస్య గురించి గతంలో ఆస్పత్రి వైద్యాధికారులు శ్రీసిటీ ఎండీ రవీంద్రసన్నారెడ్డికి రాతపూర్వకంగా వినతిపత్రాన్ని అందజేశారు. వెంటనే స్పందించిన ఆయన 15నెలల పాటు శ్రీసిటీ ద్వారా సెక్యూరిటీ సిబ్బందిని రాత్రివేళల్లో నియమింపజేశారు. దీంతో మహిళా వైద్య సిబ్బంది విధుల నిర్వహణకు భద్రతగా శ్రీసిటీ సెక్యూరిటీ నిలిచింది. అయితే గత ఏడాది జూన్ 1 నుంచి వారు కేటాయించిన సమయం మించిపోవడంతో సెక్యూరిటీ సిబ్బందిని శ్రీసిటీ యాజమాన్యం నిలిపివేయడం జరిగింది. దీంతో మరలా ఆస్పత్రికి సెక్యూరిటీ సమస్య పునరావృతమైంది. ఆస్పత్రికి సమీపంలో వందలాది పరిశ్రమలు ఉన్నాయి. అక్కడ పనిచేస్తున్న కార్మికులందరూ చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచే వైద్యసేవలను పొందుతారు. కనీస సామాజిక దృక్పథంతో స్పందించి ఆస్పత్రి భద్రతకు అండగా నిలిచే విధంగా పరిశ్రమ యాజమాన్యాలు ముందుకు రావాలని స్థానికులు, వైద్యాధికారులు కోరుతున్నారు.

ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాం..



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాత్రివేళ భద్రతా ఇబ్బందులను ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సెక్యూరిటీ గార్డ్‌ను నియమించాలని కోరాం. ఇక్కడ వైద్య సిబ్బందికి రాత్రివేళల్లో తలెత్తుతున్న సమస్యలను సైతం జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు తెలియపరిచాం. ఈ సమస్యల పరిష్కారానికి ఇక అంతిమంగా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

–పవన్‌కుమార్, ప్రధాన వైద్యాధికారి, చిన్నపాండూరు పీహెచ్‌సీ

వైభవం.. తొలి ఏకాదశి పూజలు


గ్రామోత్సవంలో కల్యాణ వెంకన్న

నారాయణవనం: స్థానిక టీటీడీ అనుబంధ పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం తొలి ఏకాదశి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తెలుగువారి పండుగలు ప్రారంభమయ్యే తొలి ఏకాదశి కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం పద్మావతి, శ్రీదేవి, భూదేవితో స్వామి వారికి కల్యాణం నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న తిరుచ్చి వాహనాన్ని అధిష్టించి మాడ వీధుల్లో విహరించారు.

త్వరలో విగ్రహ ప్రతిష్ఠ

బుచ్చినాయుడుకండ్రిగ: కంచనపుత్తూరులో గంగమ్మ ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గ్రామస్తులు విరాళాలు వేసుకుని గుడి నిర్మాణాన్ని చేపట్టారు. ఎన్నో సంవత్సరాలుగా గంగమ్మ గుడి నిర్మించాలన్న కోరిక ఉన్నప్పటికీ చేపట్టలేకపోయామని, మూడు నెలలుగా జోరుగా నిర్మాణ పనులు జరుగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. త్వరలోనే గంగమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించి కుంభాభిషేకం చేస్తామన్నారు.

ప్రసన్న వేంకటేశ్వరుని సేవలో మాజీ ఎమ్మెల్యే


తొండమానుపురం ఆలయంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: తొలి ఏకాదశి పురస్కరించుకుని తొండమానుపురంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని ఆదివారం శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ధర్మరాజస్వామి సేవలో..

పట్టణంలోని ధర్మరాజస్వామి ఆలయ ఆధ్వర్యంలో ఆదివారం అగ్నిగుండ మహోత్సవం జరిగింది. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

వీరభద్రుని సేవలో..

తొట్టంబేడు: తొలి ఏకాదశి పురస్కరించుకుని చిన్న సింగమాలలోని వీరభద్రస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వారికి ఆలయ పండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

కోలాహలం.. అగ్నిగుండ మహోత్సవం


చిన్నారిని ఎత్తుకుని అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తుడు


అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న పూజారి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా వెలసిన ధర్మరాజులస్వామి ఆలయంలో అగ్నిగుండ మహోత్సవం కోలాహలంగా జరిగింది. 4వేల మంది భక్తులు కంకణధారులై అగ్నిగుండ ప్రవేశం చేశారు. అమ్మవారిని ఊరేగింపుగా తీసుకుని ఆలయం చుట్టూ మూడుమార్లు ప్రదక్షిణ చేసి సింహవాహనంపై అధిష్టించారు. అగ్నిగుండం మహోత్సవాన్ని ప్రారంభించారు. అనువంశిక పూజారి మల్లెచెండుతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. అనంతరం పోతురాజు, గెరిగతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. వారి వెంట 4వేల మంది భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఎమ్మెల్యే, బొజ్జల సుధీర్‌రెడ్డి, ఈఓ బాపిరెడ్డి, ఆలయ అధికారులు, డీఎస్పీ నరసింహామూర్తి ఆధ్వర్యంలో పోలీసుల పర్యవేక్షణలో అగ్నిగుండ ప్రవేశం సవ్యంగా సాగింది.

సమ్మెకు సంఘీభావంగా ర్యాలీ


బైక్ ర్యాలీలో నేతలు

శ్రీకాళహస్తి: మోదీ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 9వ తేదీన జరిగే దేశవ్యాప్త కార్మిక సమ్మెకు సంఘీభావంగా కార్మిక సంఘాలు ఆదివారం పట్టణంలో నిర్వహించిన బైకు ర్యాలీ విజయవంతమైంది. స్థానిక పంచాయతీరాజ్ అతిథి గృహం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ జరిగింది. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, ఏఐటీయూసీ అనుబంధ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కత్తి రవిలు మోదీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సంయుక్తంగా ధ్వజమెత్తారు. సమ్మెలో అన్ని వర్గాల కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ నేతలు పుల్లయ్య, గంధం మణి, వెంకటేష్, వేణు, రాధమ్మ, రేవతి, కార్తీక్, మల్లికార్జున్, సాయి పాల్గొన్నారు.

సత్యవేడు టీడీపీలో మారుతున్న సమీకరణాలు

- టీడీపీ ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్‌గా కూరపాటి శంకర్‌రెడ్డి
- సిట్టింగ్ ఎమ్మెల్యేకు చెక్ పెట్టడానికే వ్యూహం


శంకర్ రెడ్డి

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్‌గా తిరుపతికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కూరపాటి శంకర్‌రెడ్డి నియమితులయ్యారు. సత్యవేడు మండలం రేపల్లెవాడకు చెందిన శంకర్‌రెడ్డి వ్యాపార రీత్యా తిరుపతిలో స్థిరపడ్డారు. సార్వత్రిక ఎన్నికల ముందు టీడీపీకి మద్దతు ఇచ్చారు. తుడా చైర్మన్ పదవి ఆశించి భంగపడ్డారు. ఈ క్రమంలో సత్యవేడు నియోజకవర్గ పార్టీ ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్‌గా పదవి వరించింది.

మారుతున్న సమీకరణాలు

సత్యవేడు నియోజకవర్గ టీడీపీలో సమీకరణాలు మారుతున్నాయి. ఎమ్మెల్యేగా కోనేటి ఆదిమూలం గెలిచినప్పటికీ మహిళపై లైంగిక వేధింపుల ఘటనలో పార్టీ అధిష్టానం ఆయనను సస్పెండ్ చేసి పక్కన పెట్టింది. దీంతో 10 నెలలుగా రాజకీయ అనిశ్చిత నెలకొంది. దీంతో ఎన్నికల సమయంలో పరిశీలకులుగా వచ్చిన చంద్రశేఖర్‌నాయుడు తానే ఇంచార్జ్‌నంటూ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటూ సిట్టింగ్ ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా పావులు కదిపారు. ఆయనకు తోడుగా సూళ్లూరుపేటకు చెందిన శ్రీపతిబాబును కో–ఆర్డినేటర్‌గా నియమింపజేశారు. వీరు 6 నెలలుగా ఓ వర్గాన్ని పెంచి పోషిస్తూ అధికారులను సైతం తమ కనుసన్నల్లో ఉండేలా చేసుకున్నారు. పార్టీ ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్ పేరిట శంకర్‌రెడ్డి నియమితులు కావడంతో చంద్రశేఖర్‌నాయుడు, శ్రీపతిబాబు పరిస్థితి ఏమిటని టీడీపీ శ్రేణులు చర్చించుకుంటున్నారు. పార్టీ రెగ్యులర్ ఇన్‌చార్జ్‌గా కావలికి చెందిన మాలేపాటి సుబ్బరాయుడును నియమించినట్లు సమాచారం. ఎవరు వచ్చినా తమకు ఒరిగేదీమీ లేదని పార్టీ నాయకులు, కార్యకర్తలు గుసగుసలాడుతున్నారు.

ఘనంగా మలయాళస్వామి ఆరాధనోత్సవం


ఆరాధనోత్సవాల్లో పూర్వ విద్యార్థులు

ఏర్పేడు: ఏర్పేడు సమీపంలోని ఆధ్యాత్మిక క్షేత్రం వ్యాసాశ్రమ వ్యవస్థాపకులు సద్గురు మలయాళ స్వామి 63వ ఆరాధనోత్సవం ఆదివారం వ్యాసాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. వ్యాసాశ్రమ మేనేజర్ మన్నెం అమరనాథరెడ్డి పర్యవేక్షణలో స్వాములు ఆశ్రమంలోని అధిష్టాన మందిరంలో ఏర్పాటు చేసిన మలయాళస్వామి శ్వేతశిలా విగ్రహానికి విశేష అభిషేక పూజలు చేశారు. గీతాపారాయణ గావించారు. ఆశ్రమ పూర్వ విద్యార్థులు 150మంది ఈ ఆరాధనోత్సవంలో పాల్గొని స్వామివారి శ్వేత శిలా విగ్రహానికి మొక్కులు చెల్లించారు. వ్యాసాశ్రమం వ్యవస్థాపకులు మలయాళ స్వామి విగ్రహాన్ని ఏర్పేడులో స్థాపించేందుకు పూర్వ విద్యార్థులు తీర్మానించారు. ఆశ్రమ పురోభివృద్ధికి తమ వంతు కృషిచేస్తామని ఆశ్రమ పూర్వ విద్యార్థి, మాజీ ఎమ్మెల్సీ సభ్యుడు వితపు బాలసుబ్రమణ్యం అన్నారు. అనంతరం అన్నదాన మండపంలో భక్తులకు అన్నదానం చేశారు.

ఆకట్టుకున్న దుర్యోధన వధ


అగ్నిగుండం వెలిగిస్తున్న దృశ్యం


తలపడుతున్న భీమ, దుర్యోధన వేషధారులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా చెన్నై రోడ్డులోని ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఆలయంలో వారం రోజులుగా బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్యోధన, దుశ్శాసన వధ పౌరాణిక ఘట్టాన్ని ప్రదర్శించారు. అలాగే మట్టితో తయారు చేసిన దుర్యోధన, దుశ్శాసన బొమ్మలపై భీముడు విన్యాసాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. అలాగే ద్రౌపదీ ధర్మరాజులస్వామి ఆలయానికి ఎదురుగా అగ్నిగుండం వెలిగించారు. అగ్నిగుండంలో భక్తులు తాము తెచ్చిన కట్టెలను వేసి మొక్కులు తీర్చుకున్నారు. అగ్నిగుండం చుట్టూ మహిళలు పొంగళ్లు పెట్టి, కోళ్లను కోసి అగ్నిగుండానికి హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

మర్యాదపూర్వక కలయిక



సిరాజ్‌బాషాను సత్కరిస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సన్మానిస్తున్న బియ్యపు మధుసూదన్ రెడ్డి

శ్రీకాళహస్తి: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన సిరాజ్‌బాషా ఆదివారం తిరుపతిలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. మాజీమంత్రి సిరాజ్‌కు దుశ్శాలువ కప్పి అభినందించారు. అదేవిధంగా శ్రీకాళహస్తిలో బియ్యపు మధుసూదన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా సిరాజ్ బాషా కలిశారు.

ఘనంగా మొహర్రం


అగ్నిగుండం ప్రవేశం చేస్తున్న భక్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరు, వెస్టువరత్తూరు, కాటూరు, పీవీకండ్రిగ, పుత్తేరి, కంచనపుత్తూరు గ్రామాల్లో ఆదివారం మొహర్రంను పురస్కరించుకుని పీర్ల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ముస్లింలు దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా గ్రామాల్లోని చావిడిలో పీర్లను నిలిపి దూపం వేసి ప్రార్థనలు చేశారు. శనివారం అర్ధరాత్రి అగ్నిగుండం చుట్టూ జగ్గనామ్ చేపట్టారు. గ్రామస్తులు బెల్లం, పానకాన్ని తీసుకొచ్చి నైవేద్యం సమర్పించారు. ముస్లింలు, హిందువులు కలిసి కోర్కెలు తీరాలని అగ్నిగుండంలో ప్రవేశించారు. బెల్లం చదివింపుగా ఇచ్చారు. భక్తులకు గంధం పంచారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడదాం

- ఏడాది పాలనలో అక్రమ కేసులు.. విధ్వంసాలే
- భూమన కరుణాకరరెడ్డి, సమన్వయకర్త నూకతోటి రాజేష్




సమావేశంలో ప్రసంగిస్తున్న సమన్వయకర్త నూకతోటి రాజేష్, హాజరైన పార్టీ శ్రేణులు

వరదయ్యపాళెం(నాగలాపురం): కూటమి ప్రభుత్వ మోసాలను, వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు. నాగలాపురంలోని ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో అంశంపై నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఎన్నికల్లో ప్రజలకు పలు హామీలు ఇచ్చి నిలువునా మోసం చేశారని గుర్తు చేశారు. ఏడాది పాలనలో ఇసుక, మట్టి, మద్యం, గంజాయి మాఫియా చెలరేగిపోతున్నాయని దుయ్యబట్టారు. ఈ విషయాలను ప్రజలకు చాటిచెప్పాలన్నారు.

సమన్వయంతో పనిచేద్దాం

సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ మాట్లాడుతూ చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ నెల 13 నుంచి 20 వరకు మండలాల వారీగా విస్తృత సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం 21 నుంచి ఆగస్టు 4వరకు గ్రామస్థాయిలో కార్యక్రమాలు చేపడతామన్నారు. గ్రామాల్లో ప్రజలతో మమేకమై చంద్రబాబు మేనిఫెస్టో మోసాలను వివరించాలన్నారు. ఎంపీపీలు సింధు శ్యామ్, దివాకర్ రెడ్డి, నందగోపాల్, పద్మప్రియ, జెడ్పీటీసీలు సుమతి, విజయలక్ష్మి, రాష్ట్ర చేనేత కార్మిక విభాగం కార్యదర్శి బొప్పన తిలక్‌బాబు, సింగిల్ విండో మాజీ చైర్మన్లు నిరంజన్ రెడ్డి, హరిబాబు రెడ్డి, నియోజకవర్గ అనుబంధ విభాగ అధ్యక్షులు బందిల సురేష్, వినోద్ యాదవ్, దుద్దు వేణు, మస్తానమ్మ, షాపుద్దీన్, శివా యాదవ్, మహేంద్ర, పెద్దిరెడ్డి మల్లికార్జున రెడ్డి, రాష్ట్ర యువజన సంయుక్త కార్యదర్శి శివచక్రవర్తి, సీనియర్ నాయకులు భానుప్రకాష్ రెడ్డి, బెల్టు రమేష్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన గళం వినిపిద్దాం

కూటమి ఏడాది పాలనలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులు, మహిళలపై అఘాయిత్యాలు తప్ప ఏమీ లేవు. ప్రతిపక్ష పార్టీగా ప్రజల పక్షాన ఉంటూ కూటమి వైఫల్యాలను ఎండగడదాం.
–వేలూరు రాకేష్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్

ప్రజలను మోసం చేస్తున్న చంద్రబాబు

గ్రామస్థాయిలో చంద్రబాబు మోసాలను నిలువరించేందుకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం చక్కని వేదిక. ప్రతి ఇంటికీ వెళ్లి క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి చంద్రబాబు మోసాలను తెలియజేద్దాం.
–చిన్నా, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి

మోసపూరిత బాండ్ల గురించి చాటిచెబుదాం

కూటమి నేతల సూపర్ సిక్స్ హామీలపై చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కలిసి సంతకం చేసిన బాండ్లను పంపిణీ చేశారు. ఈ బాండ్ల గురించి బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ప్రజలకు చాటిచెబుదాం.
–మణినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు, బీఎన్‌కండ్రిగ

చంద్రబాబు మోసాలను ఎండగడదాం

కూటమి ప్రభుత్వంలో సూపర్ సిక్స్‌తో పాటు 143కు పైగా హామీలిచ్చి గద్దెనెక్కాక వాటిని విస్మరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజల్లో ఎండగడదాం. –వీరేంద్ర వర్మ, ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్మిక విభాగం మాజీ అధ్యక్షుడు

మహిళలను వంచించిన కూటమి ప్రభుత్వం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలన్నింటినీ మహిళల పేరిట ఇస్తూ వారికి అగ్రస్థానం ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో మహిళలను వంచించింది. కూటమి హామీలు నమ్మి మహిళలు మోసపోయారు. –బొర్రా మాధవి రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షురాలు

సైనికుల్లా పనిచేద్దాం

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలుచేయకుండా ప్రజలను నిలువునా మోసం చేసింది. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేద్దాం. చంద్రబాబు చేస్తున్న మోసాలను వివరిద్దాం.
–అపరంజిరాజు, పార్టీ మండల అధ్యక్షుడు, నాగలాపురం